క్లుప్తంగా

కార్తికేయుడి సన్నిధిలో భక్తజన కోలాహలం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముస్లిం సంప్రదాయాలతో ప్రగతి దిశగా అడుగులు




పెడన: ముస్లిం మత సంప్రదాయాలను అనుసరిస్తూ ప్రగతి దిశగా అడుగులు ముందుకు వేద్దామని ముస్లిం ఆధ్యాత్మిక గురువులు పలువురు వ్యాఖ్యానించారు. స్థానిక తోటమూల సెంటర్‌లో దీని ఇస్తిమా సదస్సులో ఆదివారం ముస్లింలను ఉద్దేశించి మతగురువులు పలు విషయాలను బోధించారు. ముస్లింలు ఐక్యత, ప్రేమానురాగాలను పంచడం, ఇస్లామిక్ మత విలువల పరిరక్షణే లక్ష్యంగా నడుచుకోవాలని ఆకాంక్షించారు. సదస్సులో ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సినీ మ్యూజికల్ నైట్



గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవంలో భాగంగా ఆదివారం ప్రదర్శించిన సినీ మ్యూజికల్ నైట్ విద్యార్థుల కేరింతల మధ్య ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్ ఆధ్వర్యంలో బృందంతో నిర్వహించిన కార్యక్రమంలో సినీ గాయకులు ధనుంజయ్, సాహితీ తదితరులు సినీ గీతాలను ఆలపించారు. అనంతరం గాయకులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఫార్మసీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్లు ముసునూరి శ్రీనివాసరరావు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోదండ రామారావు, డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

మైనార్టీలు అంతా జగనన్న వెంటే



ఉయ్యూరు: ముస్లిం మైనార్టీలు అంతా సీఎం జగనన్నతోనే నడుస్తామని ఆ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని షాదీఖానాలో మైనార్టీ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందన్నారు. మైనార్టీల సంక్షేమానికి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి చేశారన్నారు. వైఎస్సార్ బాటలోనే సీఎం జగనన్న నడుస్తూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సద్దాం మాట్లాడుతూ టీడీపీ నీచ రాజకీయాలు సాగనివ్వబోమన్నారు. మైనార్టీల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్న దిగజారుడు పొత్తులను విశ్వసించబోమన్నారు. ముస్లిం సమాజం జగనన్నకు అండగా ఉంటుందని స్పష్టంచేశారు. నాయకులు అబ్దుల్ గఫూర్, సత్తార్, షరీఫ్, ఖాన్, బారీ, ఆసిఫ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట

పెనమలూరు: గోసాల గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. గోసాల శ్రీ సిటీలో శ్రీ షిరిడీ సాయిబాబా, గణపతి, దత్తాత్రేయ విగ్రహాలతో పాటు ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఉదయం 10.38 గంటలకు ఘనంగా జరుపనున్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ ఉంటుందని తెలిపారు.

బడి మారింది



నాడు.. వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల భవనం



నేడు.. అదనపు హంగులతో వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల

నాగాయలంక మండలంలో నాడు–నేడు పనులు 90శాతం పూర్తి

నాగాయలంక: గత ప్రభుత్వ హయాంలో సముద్ర తీరప్రాంతం నాగాయలంక మండలంలోని ప్రభుత్వం పాఠశాలలు అభివృద్ధికి ఆమడదూరంలో కనిపించేవి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యమివ్వడంతో నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. మండలంలో మొత్తం 51పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు–38, ప్రాథమికోన్నత పాఠశాలలు–8, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నడుస్తున్నాయి. 2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేయగా నాగాయలంక జెడ్పీ హైస్కూలుతో అనుబంధంగా దీన్ని ఏర్పాటుచేశారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అవకాశం లేదని గత ప్రభుత్వ నిబంధనలు తెలపడం.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏకంగా బాలికల కళాశాలను మండల కేంద్రంలో కేటాయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు.. వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు



నేడు.. వక్కపట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు

మొదటి దశలో రూ.4.85 కోట్లు..
రెండో దశలో రూ.5.22 కోట్లతో..

మండలంలో మొదటి దశ నాడు–నేడు మనబడి కింద రూ.4.85 కోట్లతో 25 పాఠశాలల అభివృద్ధి చేపట్టి నూరు శాతం పూర్తి చేశారు. వీటిలో 15 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, ఒక హైస్కూలు ఉన్నాయి. నాడు–నేడు పథకం రెండో దశలో రూ.5.22 కోట్లతో 17 పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఈ దశలో ఏడు ప్రాథమిక పాఠశాలలు, ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు, ఉన్నత పాఠశాలలు మూడు ఉన్నాయి.

రెండో దశ పనులు 90 శాతం పూర్తి..

రెండో దశ పనులు 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. ఈ పథకం కింద పాఠశాలలకు టాయిలెట్స్, తరగతి గదులు, ఆవరణలో మరమ్మతులు, తాగునీరు, విద్యుదీకరణ, ఇంగ్లిష్ ల్యాబ్, ఫర్నిచర్, గ్రీన్‌బోర్డు, పాఠశాల రంగులు సమకూరాయి. ఇంకా కొన్ని ప్రహరీల ఏర్పాటువంటి అదనపు పనులు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యను పెంపొందించడానికి నాడు–నేడు ఫేజ్–1 కింద మండలంలోని 5 పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, రెండు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను ప్రభుత్వం కేటాయించింది.

విద్యావిధానంలో ఎన్నో మార్పులు



విద్యావిధానంలో ఇన్ని మార్పులు, అభివృద్ధిని ఎవరూ ఊహించలేదు. ఇంతటి సాహసోపేతమైన మౌలిక సదుపాయాల కల్పన కేవలం జగనన్నకే సాధ్యం. మా ఊరి ప్రాథమిక పాఠశాల నాడు–నేడు పథకంతో వినూత్న హంగులతో రూపొందించారు. ప్రాథమిక స్థాయి నుంచే ఇన్ని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేశారు.

–అంబటి శ్యామ్ ప్రసాద్, సర్పంచి, వక్కపట్లవారిపాలెం

నవశకానికి నాంది



విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన నవశకానికి నాంది. ఇదే క్రమంలో ఉపాధ్యాయులు కూడా ఆంగ్ల మాధ్యమంపై శ్రద్ధ పెడితే ప్రభుత్వ పాఠశాలలకు మరిన్ని సత్ఫలితాలు అందుతాయి. ఇలాంటి సముద్ర తీర ప్రాంత మండలాల్లో ఎంతో ఆవశ్యకత గల విద్యరంగాన్ని అభివృద్ధి చేశారు.

–అన్నపరెడ్డి రామారావు ,మండల విద్యాశాఖ అధికారి–2, నాగాయలంక

ప్రత్యేక పూజల్లో దంపతులు



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయం ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పదుల సంఖ్యలో దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగణపతి, శ్రీకృష్ణ, ధ్వజ, శిఖర పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠకు వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలు కొనసాగాయి. ధ్వజస్తంభాన్ని అలంకరించి ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

నేడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి గ్రామంలోని ప్రధానం సెంటర్‌లో శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఉదయం 10:38 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. గ్రామంలో యాదవులందరూ కలిసి విరాళాలు సేకరించి శ్రీకృష్ణ మందిరం నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ యువజన అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, గుడివాడ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను హాజరవుతారని తెలిపారు. ఆదివారం శ్రీకృష్ణ స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. యాదవ సంఘ యువకులు అధిక సంఖ్యలోని డ్యాన్స్‌లు చేశారు. మొవ్వా శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- రూ.1.75 కోట్లతో అభివృద్ధి
- లక్ష్మీపురం, మాజేరుల్లో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



రామానగరంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సింహాద్రి రమేష్ బాబు

చల్లపల్లి: మహాత్మాగాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాకారమవుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరులో ఆదివారం రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–2 భవనం, రామానగరంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–3 భవనాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన ప్రతి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటే, ప్రతిపక్ష నాయకులు ప్రతినిత్యం అభివృద్ధి లేదంటూ దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందిస్తూ, ప్రతి గ్రామంలో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్.నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ (నాని), సర్పంచ్‌లు కొల్లూరి కోటేశ్వరరావు, కోళ్లపల్లి లక్ష్మి, డొక్కు నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, తమ్ము లక్ష్మి, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్లు అరజా శివశంకర్, పేరం నాగిరెడ్డి, పార్టీ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, బొందలపాటి లక్ష్మి, వెనిగళ్ల తారక జగదీష్, మద్దాల వీరాస్వామి, పరుచూరి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు



1వ డివిజన్‌లో శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల గడప గడపకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 1, 50, 46 డివిజన్లలో పలు అభివృద్ధి పనులను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆదివారం ప్రారంభించారు. 1వ డివిజన్‌లో ఎంపీ అయోధ్యరామిరెడ్డి ఇచ్చిన రూ. 20 లక్షల నిధులతో పార్కు ప్రహరీ, రూ. 15.50 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 50వ డివిజన్‌లో దాదాపు రూ. 53 లక్షలతో నాలుగు సిమెంటు రోడ్ల నిర్మాణానికి, 46వ డివిజన్‌లో రూ. 17.42 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. చిలకలపూడి మూడు గుళ్ల సెంటరు నుంచి చిలకలపూడి రైల్వేస్టేషన్ వరకు రూ. 38 లక్షలతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సాగుతోందన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమాన్ని ప్రతి గడపకూ అవినీతికి తావులేకుండా అందించారన్నారు. మునుపెన్నడూ జరగని విధంగా జగన్ పాలనలో అభివృద్ధి జరుగుతోందని ఇది చారిత్రాత్మక విషయమని చెప్పారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఆదివారం ఒక్క రోజే రూ. 1.43 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక కృషితో మంజూరైన నిధులతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు జోగి చిరంజీవి, మరీదు రాటాలమ్మ, భోగాది సాయి, వేముల గాంధీ, పర్ణం సతీష్, పడమట రేవతి, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పలు డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉల్లిపాలెం

- అష్టాక్షరీ స్వామీజీ
- రూ.8లక్షలతో నిర్మించిన ముఖద్వారం ప్రారంభం



ప్రత్యేక పల్లకీలో స్వామివార్ల ఊరేగింపు

కోడూరు: దివిసీమ ప్రాంతంలో అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గ్రామం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందని అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ అన్నారు. గ్రామంలోని గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామివారి ఆలయానికి సంబంధించి.. రూ.8 లక్షలతో నిర్మించిన ముఖద్వారాన్ని ఆదివారం అష్టాక్షరీ స్వామీజీ ప్రారంభించారు. రాష్ట్రంలో ఏకైక 11అడుగుల శ్రీమన్నారాయణుడి ఏకశిలా విగ్రహం ఈ క్షేత్రంలోనే ఉందని, ఇక్కడ ఆలయం లోపల నుంచే దేవాలయంపై ఉన్న శిఖరాలను కూడా దర్శించుకోవచ్చని స్వామీజీ చెప్పారు. ఈ క్షేత్రంలోనే నమ్మాళ్వర్లు, రామానుజాచార్యుల ఆలయాలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం శ్రీమన్నారాయణుడి ఆలయం ఎదురుగా రాజగోపురం నిర్మాణం కూడా చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆలయ వెనుక భాగంలో కోనేరు నిర్మించి అందులో జలనారాయణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు స్వామీజీ చెప్పారు. ముఖద్వారం నిర్మాణానికి సహకరించిన దాత బొలిశెట్టి శ్రీమన్నారాయణ కుటుంబసభ్యులను స్వామీజీ శాలువాలు కప్పి సత్కరించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

పల్లకీలో స్వామివార్ల ఊరేగింపు

మాఘమాసం పురస్కరించుకొని శ్రీమన్నారాయణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక తిరుచ్చిపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయ మాడవీధులతో పాటు గ్రామ పురవీధులు వెంట ఊరేగించారు. భక్తుల హరినామస్మరణ మధ్య ఊరేగింపు జరిగింది. శ్రీమన్నారాయణుడి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవనిగడ్డలో వరికుప్ప దగ్ధం

అవనిగడ్డ: వేకనూరు పంచాయతీ గ్రామ కార్యదర్శి రాజనాల శివనాగ ఫణీంద్రకు చెందిన ఎకరం వరి పంటకు శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కొద్దికాలంగా స్థలాన్ని దేవాలయానికి ఇవ్వాలని ఆలోచనలో ఉన్నట్లు శివనాగఫణీంద్ర తెలిపారు. దేవునికి ఇచ్చే స్థలంలో ఇటువంటి సంఘటన దారుణమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై బందరు రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామంలో కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై చాణక్య ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురు పందెంరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి మూడు పందెంకోళ్లతో పాటు రూ. 2060 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిని సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చాణక్య తెలిపారు.

తోట్లవల్లూరు: మండలంలోని బొడ్డపాడులో కోడిపందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఇద్దరు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఒక కోడిపుంజు, రూ.1150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

జగనన్నను ఆశీర్వదించండి.. సంక్షేమ ఫలాలు అందుకోండి

నడపూరులో జరిగిన ప్రజాదీవెనలో ఉప్పాల రాము



నడపూరులో గ్రామస్థులను కలిసి జగనన్నను ఆశీర్వదించాలని కోరుతున్న ఉప్పాల రాము

పెడన: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించి సంక్షేమ ఫలాలను నేరుగా అందుకోవాలని వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. నడుపూరు గ్రామంలో ఆదివారం ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా గడప గడపకు తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరుతూ వారికి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టనష్టాలను స్వయంగా చూసి ఏ పథకాలతో పేదలు ఆర్థికంగా బలోపేతమవుతారో గుర్తించి ఆ సంక్షేమ ఫలాలను నేరుగా అందించారన్నారు. దళారులు లేకుండా లబ్ధిదారుల ఖాతాలకు పథకాల నగదును జమ చేసిన వ్యక్తి మన జగన్‌మోహన్‌రెడ్డి అని, అటువంటి ముఖ్యమంత్రి మనకు మళ్లీ రావాలని కోరారు. అందుకు మీరంతా అండగా నిలిచి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ రెండు ఓట్లు ఇస్తారని, ఆ రెండు కూడా ఫ్యాను గుర్తుకే వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ పెడన మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, పార్టీ నాయకులు గరికపాటి రామానాయుడు, రాజులపాటి అచ్యుతరావు, గొరిపర్తి రవికుమార్, శింగంశెట్టి రాంబాబు, వజ్జి విజయకుమారి, అశోక్, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము



కామేశ్వరరావు, రత్నారావులను సత్కరిస్తున్న ఉప్పాల రాము తదితరులు

గూడూరు: పార్టీ కోసం కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. ఆకుమర్రులో ఆదివారం గూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన కారుమంచి కామేశ్వరరావు ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. గూడూరులోని మండల వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పాల రాము మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేసిన కామేశ్వరరావుకు పదవి దక్కడం అభినందనీయమన్నారు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని కామేశ్వరరావు ఈ స్థాయికి వచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. తద్వారా రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేసిన జగనన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గత ఐదేళ్ల పాలన చూసి ఓట్లేయాలని దమ్ముగా అడిగే నాయకుడు మన జగనన్న అన్నారు. పెడనలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతాడో రాష్ట్రంలోనూ అదే పార్టీ అధికారంలోకి రావడం ఆనవాయితీగా మారిన నేపథ్యంలో రానున్న కాలంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రస్తుతం వీధి కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే సార్వత్రిక ఎన్నికల తర్వాత గడప గడపకు కుళాయిల ద్వారా నీరు ఇచ్చే ఏర్పాటు చేస్తానని రాము హామీ ఇచ్చారు. పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కారుమంచి కామేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇస్తున్న ప్రాధాన్యం కారణంగానే గూడూరు పీఏసీఎస్ చరిత్రలో మొదటిసారి చైర్మన్ పదవి ఎస్సీలకు దక్కిందన్నారు. కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్లపల్లి రామ్ సుధీర్, పర్ణం పెదబాబు, నేతలు కుటుంబరావు, దావు భైరవలింగం, లింగం విజయ్, బొర్రా దుర్గారావు, పిట్ల రామిరెడ్డి, పార్టీ కార్యకర్తలు, మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గూడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కారుమంచి కామేశ్వరరావు, కేడీసీసీబీ డైరెక్టర్ మోటేపల్లి రత్నారావులను ఉప్పాల రాము ఘనంగా సత్కరించారు.

మద్యం సీసాతో దాడి

పెనమలూరు: యనమలకుదురులో జరిగిన దాడి ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం..యనమలకుదురుకు చెందిన బొమ్మిడి నాగరాజు 3 సంవత్సరాల క్రితం మచిలీపట్నం పోలాడుతిప్పకు చెందిన ఎం.నాగరాజు వద్ద రూ.60 వేలు అప్పు తీసుకున్నాడు. కాగా శనివారం అప్పుతీర్చుతానని బొమ్మిడి నాగరాజు చెప్పడంతో ఎం.నాగరాజు యనమలకుదురుకు వచ్చాడు. అతనికి ఇవ్వాల్సిన రూ.60 వేలను బొమ్మిడి నాగరాజు ఇచ్చిన తరువాత ఇద్దరూ మద్యం తాగారు. అప్పు 3 సంవత్సరాల తరువాత తీర్చుతావా అని ఎం.నాగరాజు ఆగ్రహంతో బొమ్మిడి నాగరాజుపై మద్యం సీసాతో తల పై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన బొమ్మిడి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.